



పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఒక ప్రైవేటు విద్యా సంస్థ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టర్ కార్యాలయం

ముప్పు తప్పినా అప్రమత్తం

తుఫాన్ ప్రభావంతో జిల్లాలో మోస్తరు వర్షాలు

- భారీ వర్షాలు పడకపోవడంతో ఊపిరిపీల్చుకున్న అన్నదాతలు
- ఈదురు గాలులతో పలుచోట్ల నేల వాలిన వరి పైరు
- ఏడో తేదీ వరకు చెదురు మదురుగా వర్షాలు కురుస్తాయని వ్యవసాయ శాఖ వెల్లడి





ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరులో నీట మునిగిన వరి పనలను నిలబెట్టుకునే పనిలో రైతులు (ఇన్‌సెట్‌లో) నీటిలో ఉన్న వరి పనలు

అనకాపల్లి అగ్రికల్చర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు తుఫాన్ ముప్పు తొలగినట్టేనని అధికార యంత్రాంగం, వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే వాతావరణ మార్పుల కారణంగా ఈ నెల ఏడో తేదీ వరకు చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం వున్నందున వరి రైతులు అప్రమత్తంగా వుండాలని సూచిస్తున్నారు. కాగా బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ శనివారం రాత్రి తీరాన్ని తాకి, తీవ్ర వాయుగుండంగా బలహీన పడిందన్న వాతావరణ శాఖ సమాచారంతో జిల్లా రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. తుఫాన్ ప్రభావంతో శనివారం రాత్రి, ఆదివారం పగలు మోస్తరు వర్షం కురిసింది. లోతట్టుగా వున్న భూముల్లో కొద్దిపాటి నీరు నిలిచింది. కోత కోయని వరిపైరు ఎక్కడా నీట మునిగిన సమాచారం లేదని వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం ప్రకటించారు.



కోటవురట్ల మండలం రాజుపేటలో నేలవాలిన వరిపైరు

అయితే వ రా డ ం గ ం ల మండలం ఎం.కోడూరు, మాకవరపాలెం మండలం రాచపల్లి, రామన్నపాలెం, జి.కోడూరు, ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరు, వెంకటాపురం, తిమ్మాపురం, పెదగుమ్ములూరు తదితర గ్రామాల్లో ఇటీవల కోత కోసి, కుప్పవేయని పొలాల్లో వరి పనలు తడిసిపోయాయి. రైతులు పొలాల్లో నుంచి నీటిని బయటకు పంపే పనుల్లో నిమగ్నమయ్యారు. వరి పనలను గట్లపైకి చేరుస్తున్నారు.

ఈదురు గాలులకు నేలవాలిన వరి పైరు

తుఫాన్ కారణంగా ఈదురు గాలులు వీచడంతో పలుమండలాల్లో వరి పైరు నేల వాలింది. భారీ వర్షాలు కురవకపోతే ఇబ్బంది లేదని, వరి నేలవాలిన పొలాల్లో రైతులు నాలుగైదు దుబ్బులను కలిపి కట్టుకుని నిలు బెట్టుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు సూచించారు. సోమవారం చిరు జల్లులు పడవచ్చని, దీనివల్ల కోతకు వచ్చిన వరి పైరుకు నష్టం ఏమీ ఉండదని వర్షాల ప్రభావంపై ఎప్పటికప్పుడు మండలాల వ్యవసాయ అధికారుల ద్వారా రైతులకు సూచనలు ఇస్తున్నామని ఆయన తెలిపారు.

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయ శాఖ సూచన మేరకు రైతులు వరి కోతలను వాయిదా వేసుకున్నారని, అప్పటికే కోసిన వరి పనలను కుప్ప వేసుకున్నారని చెప్పారు. అయితే కొద్దిచోట్ల వరి పనలు పూర్తిగా ఎండకపోవడంతో రైతులు కుప్పలు వేయలేదని, ఇటువంటి చోట్ల వర్షాలకు వరి పనలు తడిసిపోయాయన్నారు. వరి పనలపై లీటరు నీటికి 50 గ్రాముల చొప్పు కళ్లుప్పి కలిపి పిచికారీచేసుకోవాలని, లేదంటే ఉప్పును చల్లుకోవచ్చని సూచించారు. ఎక్కడైనా వరి పనలు నీటిలో నానుతుంటే గట్లపైకి, మెరక ప్రదేశాలకు చేర్చుకోవాలని చెప్పారు.

కాగా అధికారుల హెచ్చరికల నేపథ్యంలో పరవాడ, అచ్యుతాపురం... మిగతా 6వ పేజీలో

ఇంకా పరాయి పంచనే!

అనకాపల్లి జిల్లా ఏర్పాటై రెండేన్నరేళ్లు దాటినా ప్రభుత్వ కార్యాలయాలకు సమకూరని వసతులు

- అద్దె భవనాల్లోనే అత్యధిక శాఖల కార్యాలయాలు
- అరకొర వసతితో ఉద్యోగుల ఇక్కట్లు
- అనకాపల్లి పట్టణానికి దూరంగా కలెక్టరేట్, ఎస్పీ ఆఫీసులు
- ఉద్యోగులతోపాటు ప్రజలకు సైతం తప్పని ఇబ్బందులు
- విశాఖ నుంచి ఇప్పటికీ చేరని రెవెన్యూ మేన్యువల్ రికార్డులు



అపార్టుమెంట్‌లో ఏర్పాటు చేసిన గృహ నిర్మాణ సంస్థ పీడీ కార్యాలయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాల పరిస్థితి. అనకాపల్లి జిల్లా ఏర్పాటై రెండున్నరేళ్లు దాటినా పరిపాలన గాడిన పడలేదు. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంతోసహా 35కిపైగా ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. కొన్ని శాఖల కార్యాలయాలు ఇరుకైన అద్దె భవనాల్లో నిర్వహిస్తుండడంతో ఉద్యోగులతోపాటు వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యం చెందుతున్నారు. పరిపాలనకు సంబంధించి ప్రధానమైన రెవెన్యూ మేన్యువల్ రికార్డులు ఇప్పటికీ విశాఖపట్నంలోనే వుండిపోయాయి.



ఒక ప్రైవేటు భవనం సెల్లార్‌లో బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం!

గత వైసీపీ ప్రభుత్వం పరిపాలన వికేంద్రీకరణ పేరుతో 2022 ఏప్రిల్‌లో జిల్లాలను పునర్విభజన చేసింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాను మూడుగా విభజించి అనకాపల్లి, పాడేరు కేంద్రాలుగా కొత్త జిల్లాను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో విశాఖ నుంచి కొంతమంది అధికారులు, ఉద్యోగులను సర్దుబాటులో భాగంగా అనకాపల్లి జిల్లాకు పంపారు. అయితే జిల్లాస్థాయి ప్రభుత్వ కార్యాలయాలకు సరిపడ ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేకపోవడంతో జిల్లా పరిపాలనకు కేంద్ర బిందువైన కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీ కార్యాలయం, ఇతర శాఖలను అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. జిల్లాల విభజన తరువాత సుమారు రెండేళ్లపాటు అధికారంలో వున్న వైసీపీ ప్రభుత్వం.. ఒక్క ప్రభుత్వ శాఖకు కూడా సొంత భవనం నిర్మించలేదు. కనీసం స్థలం సేకరించిన పాపానకూడా పోలేదు. 35కుపైగా వున్న జిల్లాస్థాయి కార్యాలయాలను ఇప్పటికీ అద్దె భవనాల్లోనే నడుపుతున్నారు. ఇవి కూడా ఇరుకుగా వుండడంతో విధుల నిర్వహణలో అధికారులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. సొంత భవనాల్లో నిర్వహిస్తున్న కార్యాలయాలు ఐదు లోపే ఉంటాయి.

పట్టణానికి దూరంగా కలెక్టర్, ఎస్పీ ఆఫీసులు

జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు అనకాపల్లి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న శంకరంలోని ఒక ప్రైవేటు కళాశాల భవనాలను లీజుకు తీసుకొని ఏర్పాటు చేశారు. బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కార్యాలయాలు పట్టణంలోని బహుళ అంతస్థుల భవనాల సెల్లార్లలో నిర్వహిస్తున్నారు. జిల్లా ఖజానా కార్యాలయాన్ని ఒక దుకాణ సముదాయం మూడో అంతస్థులో ఏర్పాటు చేశారు. గృహ నిర్మాణ సంస్థ పీడీ కార్యాలయం ఒక నివాస గృహ సముదాయంలో (అపార్టుమెంట్‌లో) నిర్వహిస్తున్నారు. పట్టు పరిశ్రమ కార్యాలయాన్ని జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో సబ్బవరం మండల అసకపల్లిలో ఏర్పాటు చేశారు. జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో సుమారు 40 మంది సిబ్బంది ఉండగా వారంతా రెండు గదుల్లోనే సర్దుకుని విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.

కొత్త జిల్లాకు చేరని రెవెన్యూ రికార్డులు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాగా వున్నప్పుడు రెవెన్యూ రికార్డులను ఆన్‌లైన్‌లో పొందుపర్చే పనులు చేపట్టారు. జిల్లా విభజన తరువాత రెవెన్యూ మేన్యువల్ రికార్డులను అనకాపల్లి పంపలేదు. ఇప్పటికీ విశాఖపట్నంలోని కలెక్టరేట్‌లో భూ పరిపాలన విభాగంలో వున్నాయి. వారసత్వంగా దఖలు పడిన భూములను తమ పేరున మార్చుకోనేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నా పరిష్కారం దొరకని పరిస్థితి. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పట్టాదారు పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రికార్డులు అందుబాటులో లేవని తహసీల్దార్లు బదులిస్తున్నారు. జిల్లా కేంద్రానికి పూర్తిస్థాయిలో మేన్యువల్ రికార్డులు తరలించకపోవడం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయిని అంటున్నారు.

పెరిగిన అద్దెలు.. విశాఖ నుంచే రాకపోకలు

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకే భవనాలు దొరకని పరిస్థితి ఉండడంతో ఇక అధికారులు, ఉద్యోగుల నివాస భవనాల పరిస్థితి ప్రత్యేకంగా ... మిగతా 6వ పేజీలో

విద్యుదాఘాతంతో మహిళ మృతి



కోరుకొండ లక్ష్మి (ఫైల్‌ఫొటో)

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరీపట్నం గ్రామంలో ఆదివారం ఉదయం కోరుకొండ లక్ష్మి(48) విద్యుతాఘాతానికి గురై మృతిచెందింది. అమావాస్య కావడంతో ఇంటి ముందు కట్టేందుకు కలబంద మట్టలు తేవడానికి ఆదివారం ఉదయం 10.30 గంటల సమయంలో మేడపైకి వెళ్లింది. కలబంద మట్టలు తీస్తుండగా ఇంటికి ఆనుకుని ఉన్న కరెంటు తీగలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురైంది. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే చోడవరంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్య సిబ్బంది చెప్పారు. ఈమె భర్త కొండలరావు రెండేళ్ల క్రితం గ్రామానికి ఆనుకుని ఉన్న పెద్దేరు వాగులో కొట్టుకుపోయి మృతిచెందాడు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కులా ఉన్న ఇద్దరు రెండేళ్ల వ్యవధిలో ఒకరితరువాత ఒకరు చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. కాగా నిరుపేద వ్యవసాయకుటుంబానికి చెందిన కోరుకొండ లక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక సర్పంచ్ కోన చంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు మంగా జగన్నాధరావులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


బైక్‌ను ఢీకొన్న కారు యువతి దుర్మరణం



బొడ్డేడ ప్రశాంతి (ఫైల్‌ఫొటో)

ఎస్.రాయవరం/ మునగపాక, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం మండలం గోకులపాడు సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మునగపాకకు చెందిన ఒక యువతి మృతిచెందింది. ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన మునగపాకకు చెందిన బొడ్డేడ ప్రశాంతి (19) అనకాపల్లిలోని ఒక డయాగ్నొస్టిక్ సెంటర్‌లో పని చేస్తున్నది. అదే సెంటర్‌లో పనిచేస్తున్న సంతోష్ అనే యువకుడితో కలిసి ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై కాకినాడ జిల్లా అన్నవరం ... మిగతా 6వ పేజీలో

నర్సీపట్నం ఆస్పత్రిలో వైద్యుల కొరత



రోగులకు పూర్తిస్థాయిలో అందని సేవలు

- పేరుకే 150 పడకలు... వంద పడకల స్థాయిలోనే వైద్య నిపుణులు
- ముఖ్య విభాగాల్లో భర్తీకి నోచుకోని ఖాళీలు
- రేడియాలజిస్ట్ లేకపోవడంతో స్కానింగ్ సెంటర్ మూత
- ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తున్న రోగులు
- నర్సింగ్ సిబ్బందిలో మూడో వంతు పోస్టులు ఖాళీ



ఓపీకి వచ్చిన రోగులు

నర్సీపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్యుల కొరత వల్ల రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది. పేరుకే 150 పడలక ఆస్పత్రి.. కానీ వైద్య నిపుణులు మాత్రం వంద పడకల స్థాయికి కూడా సరిపడలేరు. ప్రస్తుతం జనరల్ ఫిజిషియన్, రేడియాలజీ, డిప్యూటీ సివిల్ జర్జన్ (జనరల్), ఎన్‌డీసీ మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీలు ఉన్నాయి. రేడియాలజిస్ట్ లేక స్కానింగ్ సెంటర్ పూర్తిగా మూత పడింది.



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి

ఏజెన్సీకి ముఖ్యద్వారంగా ఉన్న నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి చుట్టు పక్కల మండలాల నుంచే కాకుండా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కొయ్యూరు, చింతపల్లి, జీకే వీధి మండలాల నుంచి రోగులు వస్తుంటారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు సాధ్యం కాని కేసులను నర్సీపట్నం ఆస్పత్రికి రిఫర్ రిఫర్ చేస్తుంటారు. మరోవైపు అవుట్ పేషెంట్ విభాగానికి రోజూ 650 నుంచి 700 మంది రోగులు వస్తుంటారు. వార్డుల్లో నిత్యం 220 నుంచి 250 మంది వరకు ఇన్‌పేషెంట్లు ఉంటారు. సోమ, బుధ, శనివారాల్లో రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ గతంలో (2014-19) అధికారంలో ... మిగతా 6వ పేజీలో

వెలుగు సీసీ సస్పెన్షన్

చోడవరం మండలంలో డ్వాక్రా సభ్యుల సొమ్ము స్వాహా వ్యవహారంలో చర్యలు

- గతంలో సింహాద్రిపురం సీసీగా పనిచేసిన తాతబాబు
- ప్రస్తుతం చీడికాడ మండలం చుక్కపల్లిలో..
- ఉత్తర్వులు జారీ చేసిన డీఆర్‌డీఏ అధికారులు



చోడవరంలో వెలుగు కార్యాలయం

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని సింహాద్రిపురం పంచాయతీలో డ్వాక్రా సభ్యుల రుణాల స్వాహా కేసులో వెలుగు సీసీ కె.తాతబాబుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

మండలంలోని సింహాద్రిపురం పంచాయతీలో సింహాద్రిపురం, పాతిక గ్రామాలకు చెందిన డ్వాక్రా సభ్యుల పేరిట బ్యాంకు నుంచి రుణాలు మంజూరు చేయించి, ఆ సొమ్మును వెలుగు వీవోఏ వరలక్ష్మి వేరే ఖాతాలకు మళ్లించి స్వాహా చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా సభ్యులు చెల్లించిన రుణ వాయిదాల సొమ్మును సైతం బ్యాంకులో జమ చేయలేదు. సుమారు రూ.30 లక్షల మేర అక్రమాలకు పాల్పడినట్టు రెండు వారాల క్రితం వెలుగు చూసింది. దీంతో వరలక్ష్మిని రెండు గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాల సభ్యులు గట్టిగా నిలదీయడంతోపాటు, వెలుగు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ డైసీని విచారణ అధికారిగా నియమించారు. తప్పు జరిగిందని, దారి మళ్లించిన డబ్బులను తాను తిరిగి ఇచ్చేస్తానని వీవోఏ వరలక్ష్మి అధికారుల ముందు అంగీకరించడంతోపాటు, ఇందులో కొంత సొమ్మును సీసీ తాతబాబుకుకు ఇచ్చినట్టు పేర్కొన్నది. డీఆర్‌డీఏ అధికారులు నిర్వహించిన విచారణలో శ్రీరామ గ్రూపునకు చెందిన రూ.6.92 లక్షల బ్యాంకు రుణం, ఇందిరా గ్రూపునకు చెందిన రూ.2 లక్షల బ్యాంకు రుణం, స్త్రీనిధి రుణం రూ.3 లక్షలు, సిద్ధి వినాయక గ్రూపునకు సంబంధించి రూ.2 లక్షల బ్యాంకురుణం, లక్ష రూపాయలు స్త్రీనిధి నిధులు కలిపి మొత్తం 14 లక్షల 92 వేల రూపాయలు ... మిగతా 6వ పేజీలో

ప్రభుత్వ భూములు కబ్జా

బోదివలస, సబ్బవరంలో పెరిపోతున్న ఆక్రమణలు

- ప్లాట్లుగా వేసి సెంట్లు చొప్పన విక్రయిస్తున్న కబ్జాదారులు



బోదివలసలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి గోడ నిర్మించిన దృశ్యం
గురవుతున్న ప్రభుత్వ(సర్వే నెంబర్లు 27,29) భూములు

సబ్బవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

మండంలోని సబ్బవరం, బోదివలస గ్రామాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. కొంతమంది స్థానికనేతలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో భూ కబ్జాలు పెరిగిపోతున్నాయి.

బోదివలసలో సర్వే నంబరు 27లో ఉన్న దుర్గాలమ్మ మెట్ట వాలుఉ ప్రాంతాన్ని కొంతమంది ఆక్రమించుకొని సెంటు రూ.2 లక్షల చొప్పున అమ్ముతున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదే విధంగా సర్వే నంబరు 29లో గెడ్డవాగు పోరంబోకు భూమిని ఆక్రమించి షెడ్లు నిర్మిస్తున్నారని చెప్పారు.



సబ్బవరం రెల్లి కాలనీ వద్ద కొండ పోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణాలు

సబ్బవరం రెల్లి కాలనీ సర్వే నంబరు 286 (సూదికొండ)లో కొండ పోరంబోకు స్థలాలన్ని కొంతమంది ఆక్రమించుకుని ప్లాట్లుగా వేసి అమ్ముతున్నారు. కొనుగోలు చేసిన వ్యక్తులు చుట్టూ పరదాలు కట్టి గుట్టుచప్పుడు కాకుండా ఇళ్ల నిర్మాణాలు సాగిస్తున్నారు. గతంలో రెల్లి కాలనీలో తొమ్మిది మంది పేదలకు మాత్రమే ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసింది. మిగిలిన స్థలాన్ని కబ్జాచేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. ఈ విధంగా 50 వరకు స్థలాలు చేతులుమారినట్టు కాలనీవాసులు చెబుతున్నారు. రెల్లి కాలనీకి సమీపంలో జగనన్న కాలనీకి అనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాలు కూడా ఆక్రమణకు గురవుతున్నాయి.

వరి రైతుల్లో గుబులు



కోటవురట్ల: జల్లూరులో పడిపోయిన వరి చేను

- తుఫాన్ వర్షాలకు నేలకొరిగిన పంట
- నీట మునిగిన వరి పనలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలంటున్న వ్యవసాయాధికారులు

కోటవురట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అక్కరకు రాకుండా పోతుందేమోనని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. శని, ఆదివారాలల్లో ఈదురు గాలులతోపాటు వర్షం కురవడంతో వరి చేను నేలకొరిగింది. పూర్తి స్థాయిలో పంట చేతికి వస్తుందని రైతులు ఆనందిస్తున్న తరుణంలో తుఫాన్ వర్షాలు కురవడం శాపంగా మారిందని రైతులు వాపోతున్నారు. మండలంలో జల్లూరు, కైలాసపట్నం, లింగాపురం, రాజుపేట, బీకేపల్లి, యండపల్లి, సుంకపూర్ తదితర గ్రామాల్లో గాలులకు వరిచేను పడిపోయింది. పలుచోట్ల కోత కోసిన వరి పనలు నీటిలో నానుతున్నాయి. అకాల వర్షాలకు నష్టపోయామని రైతులు లబోదిబోమంటున్నారు. ఆయా గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది.

పాయకరావుపేట రూరల్‌లో..

ఫెంగల్ తుఫాన్ వరి రైతుల్లో గుబులు రేపింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు, గాలులకు వరి పంట నేలకొరిగింది. మండలంలో సత్యవరం, పెంటకోట, గోపాలపట్నం, శ్రీరాంపురం, పెదరాంభద్రపురం, మాసాహెబ్‌పేట, మంగవరం, అరట్లకోట తదితర గ్రామాలలో మూడు వేల హెక్టార్లలో రైతులు వరిని సాగు చేశారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి వాతావరణం



పాయకరావుపేటరూరల్: పెదరాంభద్రపురంలో నేలకొరిగిన వరి పంట

అనుకూలించడంతో వరి పంటలు ఆశాజనకంగా పండి మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. కొన్ని గ్రామాలలో వారం, పది రోజుల్లో కోతలు చేయించాలని రైతులు సిద్ధమయ్యారు. కొన్ని చోట్ల కోతలు ప్రారంభించారు. వరి చేనులు నేలకొరగడంతో దిగుబడి తగ్గుతుందని, ఖర్చులు పెరుగుతాయని రైతులు వాపోతున్నారు.

చేతికి వచ్చిన పంట పోతోంది..

కంటే బాబూజీ, రైతు, చినగుమ్ములూరు



నేను రెండు ఎకరాల్లో వేసిన సాంబమసూరి రకం పంట కోశాను. తుఫాన్ వర్షాలకు వరి పనలు నీటిలో నానుతున్నాయి. నీటిలో ఉన్న పంటను కాపాడుకోవడానికి కుటుంబమంతా కష్టపడుతున్నాం. పంట చేతికి వచ్చిందని ఆనందం పడుతున్న సమయంలో వర్షాలకు ముంపనకు గురైంది. ప్రభుత్వం సాయమందించాలి.



ఎస్.రాయవరం: వెంకటాపురంలో నేలకొరిగిన వరి పనలు కడుతున్న రైతులు

ఎస్.రాయవరంలో..

మండలంలో పలు గ్రామాల్లో తుఫాన్ కారణంగా వరి పంట నేలకొరిగింది. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన వర్షానికి పొలాల్లోకి నీరు చేరడంతో వరి పనలు నానుతున్నాయి. మండలంలో 8,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పలు గ్రామాల్లో సాంబమసూరి రకం పంటను రైతులు ఇప్పటికే కోసి కుప్పలు పెట్టుకున్నారు. మరి కొన్నిచోట్ల కోసిన వరి పనలు వర్షపు నీటిలో ఉన్నాయి. చేతికి అందొచ్చిన వరి పంట నీటిపాలు కావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి

సౌజన్య, వ్యవసాయాధికారి

తుఫాన్‌పై ముందుగానే రైతులను అప్రమత్తం చేశాం. వర్షాలకు ఇంతవరకు వరి పంటకు నష్టం కలగలేదు. వీచిన గాలులకు వరి పనలు నేలకొరగడంతో వర్షపు నీటిలో తడవకుండా ఎలా కాపాడుకోవాలన్న దానిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడైన పంట కోసి ఉంచితే వాటికి ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. వరి పంటను కాపాడుకోవడంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

ముందుకొచ్చిన సముద్రం



పెదతీనార్లలో ముందుకు వచ్చిన సముద్రం

నక్కపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మండలంలో ఆదివారం ఉదయం ముసురు అలముకుంది. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. పెదతీనార్ల, దొండవాక, బోయపాడు తీరాల్లో 20 మీటర్ల మేర సముద్రం ముందుకొచ్చింది. పెదతీనార్లలో సముద్రపు ఒడ్డు కొంత మేర కోతకు గురైంది. మత్స్యకారులు వలల సామగ్రి, బోట్లు దెబ్బతినకుండా తుఫాన్ షెల్టర్ల వద్ద భద్రపర్చుకున్నారు.

సీపీఎం మహాసభల పోస్టర్లు విడుదల

అచ్యుతాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి మూడు రోజులపాటు నర్సీపట్నంలో జరిగే సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కన్వీనర్ ఆర్. రాము కోరారు. ఆదివారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ని ఆయన విడుదల చేశారు. ఈకార్యక్రమంలో కూండ్రపు సోమినాయుడు, కర్రి అప్పారావు, కె. రామసదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి

- ఇఫ్కో సంస్థ జిల్లా ప్రాజెక్టు అధికారి వెంకట్



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామికంగా ఎదగడానికి కృషి చేస్తున్నామని సమగ్ర రైతు సహకార సంస్థ (ఇఫ్కో) అనకాపల్లి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం. వెంకట్ అన్నారు. రామన్నపాలెంలో మైక్రో లెండింగ్‌లో భాగంగా మహిళలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తాము 56 వేల మహిళా బృందాలకు స్వయం ఉపాధి కల్పించామన్నారు. మహిళలకు వివిధ రకాల వస్తు ఉత్పత్తులకు సంబంధించి శిక్షణ ఇస్తున్నామన్నారు. దీనిని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.కార్యక్రమంలో కుమారస్వామి, సరస్వతి పాల్గొన్నారు.

'అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ'



నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి మానస అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం ఇక్కడ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు మానసిక స్థైర్యాన్ని కల్పించాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, పర్యవేక్షకులు సునీత,ఉమామహేష్ పాల్గొన్నారు.

82 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

మునగపాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చూచుకొండ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 82 మందికి పరీక్షలు నిర్వహించారు. భువనేశ్వరి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అండ నర్సింహమూర్తి రోగులకు పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో పరీక్షలు జరిపిన వారికి గుర్తింపు కార్డు ఇవ్వడం జరిగిందని, వారికి ఏడాది పాటు ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న టీటీడీ అధికారులు

మునగపాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీతారాముల దేవుని మాన్యంలో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ పనులను టీటీడీ అసిస్టెంట్ స్థపతి సుధాకర్ ఆదివారం పరిశీలించారు. ఈ ఆలయాన్ని సుమారు రూ.5కోట్లు అంచనాతో నిర్మిస్తున్నారు. పనులను పరిశీలించిన సుధాకర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొడ్డేడ ప్రసాద్, వెలగా శ్రీనివాసరావు, కాండ్రేగుల జగ్గారావు, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట ఉమేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయ అదనపు గది ప్రారంభం



నూతన అదనపు గదిని ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాటిపల్లి-మంగళవరపుపేటలో గ్రంథాలయ అదనపు గదిని గ్రామ పెద్ద భీశెట్టి మహలక్ష్మినాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు పాఠకులకు సేవలందిస్తూ.. మరోవైపు విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి ధనశ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్పందించే హృదయం సంస్థ వ్యవస్థాపకుడు ఏవీఎస్.మూర్తి, వార్డు సభ్యులు ఆడారి రామకృష్ణ, ఆడారి భాస్కరరావు, ఆడారి గోవింద జగన్నాథ, కమిటీ కార్యదర్శి యల్లపు సంజీవరావు, ఆడారి అప్పలనాయుడు, గ్రంథాలయం డైరెక్టర్లు సునీత, ధనలక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలను బలోపేతం చేసుకోవాలి

- మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

ఎలమంచిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):సాగునీటి సంఘాలను మరింత బలోపేతం చేసుకుని ఆయకట్టు రైతాంగానికి అన్ని విధాలుగా తోడ్పాటునందించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో రైతుల సంక్షేమం కోసం పాటుపడే వారిని గెలిపించుకోవాలన్నారు. పార్టీ శ్రేణులంతా అధిష్టానం నిర్ణయం మేరకు ముందుకు సాగాలన్నారు. అనంతరం రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నదన్నారు. గత ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేస్తే వాటన్నింటిని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సరి చేస్తున్నారన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని అధిగమించేందుకు మరింత ఉత్సాహంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా యాదవ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన దూళి రంగనాయకులును ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్, జిల్లా నేతలు ఆడారి మంజు, కొలుకులూరి విజయ్‌బాబు, రాజాన సూర్యనాగేశ్వరరావు, సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, నేతలు గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, గొన్నాబత్తుల శేషు, రాజాన వెంకునాయుడు, బొద్దపు రమణ, కరణం రవి, నమ్మి రమణ, సుబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు రద్దుచేయాలి

- రాష్ట్ర మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటరావు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులరిస్తున్న దళిత నాయకులు

పాయకరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దుచేయాలని రాష్ట్ర మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకటరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పాత పంచాయతీ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ షెడ్యూల్ కులాల వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గాల మేధావుల సంఘాలు, రాజకీయ నాయకులు వ్యతిరేకిస్తున్నారన్నారు. అదేవిధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో మాల సంఘాలు, మేధావులు ఈ తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తుండగా, ఎమ్మార్పీఎస్ నాయకులు, అధికారంలో ఉన్న రెండు రాష్ట్రాల కాంగ్రెస్, టీడీపీ ముఖ్యమంత్రులు స్వాగతిస్తున్నారన్నారు. గతంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు పరిమితమైన వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం నేడు దేశవ్యాప్తంగా జరుగుతోందన్నారు. ఏపీలో మాలలు 70శాతం, మాదిగలు 30 శాతం జనాభా ఉండగా విద్యా ఉద్యోగ రంగాల్లో మాలలకు జనాభాకు తగిన విధంగా రిజర్వేషన్లు పొందుతున్నారన్నారు. ఇపుడు ఎస్సీ వర్గీకరణ కారణంగా మాలలు తీవ్రంగా నష్టపోతారన్నారు. వర్గీకరణ అంశంలో అన్ని రాజకీయ పార్టీలు తటస్థ వైఖరి అవలంబించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు పెదపాటి మేఘరజన్, ఇంజరపు సూరిబాబు, చిరుకూరి పేరరాజు, కువల కుమార్, పల్లా ప్రసాద్, తాటిపాక లోవరాజు, ఐఎన్.మూర్తి, గారా చంటి, బోడపాటి సతీష్, ఏనుగుపల్లి శ్రీను, పూల చిట్టిబాబు, బోడపాటి రాంజీ, నెలపర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు స్పందన



టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న పెదిరెడ్డి శ్రీను తదితరులు

పాయకరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిర్వహిస్తున్న టీడీపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను అన్నారు. ఆదివారం పట్టణంలోని మంగవరం రోడ్డు, వీవర్స్‌కాలనీ, కరణంగారివీధి తదితర ప్రాంతాల్లో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై అధికసంఖ్యలో పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ, మరిడియ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



నినాదాలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రాంబిల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో దుర్గాంబికా భవన నిర్మాణ కార్మికుల సంఘాధ్యక్షుడు ఎస్.రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేముడునాయుడు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు నిబంధనల ప్రకారం అందాల్సిన సంక్షేమ ఫలాలు అందడంలేదన్నారు. కార్మికుల కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. పూర్తి స్థాయిలో ఇసుక సరఫరా లేకపోవడం, పనులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనరు చందక రామకృష్ణ, మత్స్యకార సంఘం నాయకులు ధోని కాసియా, కార్మికులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో కార్తీక అన్న సమారాధన



బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

మునగపాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెంకటాపురం గ్రామంలో ఆదివారం కార్తీక మాసం అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావును సత్కరించారు. గ్రామ సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి (తాతాజీ) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ సుందరపు వెంకట కనకఅప్పారావు, రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'విద్యార్థి దశ నుంచే పోటీ పరీక్షలు రాయాలి'



నమూనా పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులు

మునగపాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల దశ నుంచే పోటీ పరీక్షలు రాయడం అలవాటు చేసుకోవాలని స్పందించే హృదయం ఛారిటబుల్ ట్రస్టు గౌరవాధ్యక్షుడు కేవీ.రమణ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన పరీక్షలో ప్రతిభ చాటిన పది మందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరామారావు, ఉపాధ్యాయులు ఎం.సత్యనారాయణమూర్తి, మాడెం జోగారావు, మారిశెట్టి వెంకటఅప్పారావు, పీలా జగదీష్, బొడ్డేడ అచ్యుతకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి మార్గశిర మాసోత్సవాలు

- కొఠారు కుటుంబీకులచే తొలిపూజ



ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారు

ఎలమంచిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణలోఓని ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి మార్గశిర పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. నెల రోజులుపాటు ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కమిటీ ప్రతినిధి కొఠారు సాంబ, రాములు తెలిపారు. ఆలయంలో కొఠారు వంశీయులచే తొలిపూజ చేస్తారన్నారు. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తొలి రోజు పూజలకు భక్తులతోపాటు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు రానున్నారని వారు తెలిపారు.

ముప్పు తప్పినా.. అప్రమత్తం!

... 5వ పేజీ తరువాయి

రాంబిల్లి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో మత్స్యకారులు ఆదివారం కూడా సముద్రంలో చేపలవేటకు వెళ్లలేదు.

వర్షపాతం వివరాలు

జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా రాంబిల్లి మండలంలో 37.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నక్కపల్లిలో 35.6 మి.మీ.లు, ఎస్.రాయవరంలో 31.8, నాతవరంలో 31.4, పాయకరావుపేటలో 31.4, సబ్బవరంలో 27.6, అచ్యుతాపురంలో 27.4, ఎలమంచిలిలో 25.2, పరవాడలో 23.8, బుచ్చెయ్యపేటలో 22.6, చోడవరంలో 22.2, మునగపాకలో 20.8, గొలుగొండలో 18.2, దేవరాపల్లిలో 16.8, కోటవురట్లలో 16.4, కశింకోటలో 16.4, రావికమతంలో 16.2, కె.కోటపాడులో 16.2, అనకాపల్లిలో 15.2, మాకవరపాలెంలో 14.8, మాడుగులలో 13.8, నర్సీపట్నంలో 12.6, రోలుగుంటలో 12.4, చీడికాడలో 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నర్సీపట్నం ఆస్పత్రిలో వైద్యుల కొరత

... 5వ పేజీ తరువాయి

వున్నప్పుడు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిని వంద పడకల నుంచి 150 పడకలకు అప్‌గ్రేడ్ చేసింది. ఆ మేరకు వైద్య నిపుణులను నియమించడానికి ఏర్పాట్లు చేస్తుండగా.. వైసీపీ అధికారంలోకి వచ్చింది. తరువాత ఐదేళ్లపాటు వైద్య నిపుణులను నియమించలేదు. పూర్తి స్థాయిలో వైద్యులు లేకపోవడంతో కొన్ని విభాగాల నిపుణుల సేవలు అందని పరిస్థితి ఏర్పడింది. ఉన్న వైద్యులతోనే సేవలను కొనసాగిస్తూ వచ్చారు. ప్రస్తుతం వైద్య నిపుణులతోపాటు సిబ్బంది కొరత కారణంగా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదని విమర్శలు వస్తున్నాయి. రాత్రి సమయంలో వచ్చిన కేసుల్లో అత్యధికంగా విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారని పలువురు రోగులు ఆరోపిస్తున్నారు.

సగం పోస్టులు ఖాళీ

పేరుకు 150 పడకల ఆస్పత్రి.. కానీ వంద పడకల ఆస్పత్రికి ఉండాల్సిన వైద్యులు కూడా పూర్తి స్థాయిలో లేరు. గైనికాలజీ, చర్మవ్యాధులు, దంత, చిన్న పిల్లలు, నేత్ర, ఈఎన్‌టీ, ఎముకల వైద్య నిపుణులు ఉన్నారు. జనరల్ మెడిసిన్, రేడియాలజీ, డిప్యూటీ సివిల్ సర్జన్ (జనరల్), ఎన్‌డీసీ మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీలు ఉన్నాయి. రేడియాలజిస్ట్ లేకపోవడంతో స్కానింగ్ సెంటర్ పూర్తిగా మూత పడింది. స్కానింగ్ విభాగంలో గర్భిణులతోపాటు వివిధ సమస్యలతో వచ్చిన వారికి స్కానింగ్ పరీక్షలు చేసేవారు. రేడియాలజిస్ట్ లేక స్కానింగ్ సెంటర్ మూతపడడంతో రోగులు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బంది పూర్తిస్థాయిలో లేరు. ప్రతి వంద పడకలకు 24 మంది నర్సింగ్ స్టాఫ్ వుండాలి. ఈ ప్రకారం 150 పడకల ఆస్పత్రికి 36 మంది అవసరం. కానీ ప్రస్తుతం 23 మంది మాత్రమే వున్నారు. దీనివల్ల ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి అధికంగా వుంది. అత్యవసర సమయాల్లో సెలవు తీసుకోవడానికి వీలు కావడం లేదని వాపోతున్నారు.

వెలుగు సీసీ సస్పెన్షన్

... 5వ పేజీ తరువాయి

స్వాహా అయినట్టు నిగ్గు తేల్చారు. వీవోఏ వరలక్ష్మికి సీసీ తాతబాబు సహకారంతోనే నిధులు స్వాహా అయినట్టు నిర్ధారించారు. దీంతో ఆయనను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తాతబాబు ప్రస్తుతం చీడికాడ మండలం చుక్కపల్లి సీసీగా విధులు నిర్వహిస్తున్నారు. అప్పట్లో ఇక్కడ పనిచేసిన వెలుగు అధికారుల పాత్రపైనా విచారణ జరిపిస్తే మరిన్ని అవకతవకలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా దారి మళ్లించిన డ్వాక్రా రుణాలు, స్త్రీ నిధి డబ్బులను వెనక్కి ఇస్తానని అధికారుల ఎదుట అంగీకరించిన వీవోఏ వరలక్ష్మి.. ఇంతవరకు సొమ్ములు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు డీఆర్‌డీఏ, పోలీసు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు: యువతి దుర్మరణం

... 5వ పేజీ తరువాయి

వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా ఎస్.రాయ వరం మండలం గోకులపాడు సమీపంలోకి వచ్చేసరికి అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో సంతోష్, ప్రశాంతిలకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న వ్యక్తులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. కొద్దిసేపట్లో అంబులెన్స్ వచ్చి క్షతగాత్రులను నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రశాంతి తలకు తీవ్రగాయం చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

ఇంకా పరాయి పంచనే..!

... 5వ పేజీ తరువాయి

చెప్పాల్సిన అవసరం లేదు. జిల్లా కేంద్రం ఏర్పడక ముందు అనకాపల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేదా ఫ్లాట్ రూ.7 వేల అద్దెకు లభించేవి. జిల్లా ఏర్పడిన తరువాత రూ.10 వేలకు పెరిగింది. దీంతో చాలామంది ఉద్యోగులు విశాఖపట్నంలో సొంత ఇళ్లు వుండడం, పిల్లల చదువుల కారణంగా అక్కడి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఇక కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులు కార్యాలయానికి చేరుకొనేందుకు రవాణా సదుపాయం లేకపోవడంతో అధిక చార్జీలు చెల్లించి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.


గొలుగొండ: గుంతల్లో వర్షం నీరు చేరిన పాకలపాడు రోడ్డు


రోలుగుంట: నిండుగొండ సెంటర్ వద్ద చెరువులా బీఎన్ రోడ్డు


వర్షం నీటితో అధ్వానంగా మారిన కృష్ణాదేవిపేట బస్ స్టేషన్ రోడ్డు

దారిద్ర్యం.. వాహన చోదకులకు నరకం!

జిల్లాలో పలు మండలాల్లోని రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. ఎక్కడికక్కడ పెచ్చులు ఊడిపోయాయి. ఆద్యంతం రాళ్లు తేలిపోయాయి. గతుకులు పడి దారుణంగా తయారయ్యాయి. చినుకు పడితే చిత్తడవుతున్నాయి. వర్షం కురిస్తే చెరువులను తలపిస్తున్నాయి. మట్టి మార్గాలైతే బురదమయమవుతున్నాయి. వాహన చోదకులు, ప్రయాణికులు, పాదచారులకు ప్రత్యక్ష నరకం చూపుతున్నాయి.

గొలుగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సీపట్నం నుంచి జోగంపేట ప్రధాన రహదారి దారుణంగా తయారైంది. ఆరిలోవ అటవీ ప్రాంతంలో మూడు కల్వర్టుల వద్ద అస్తవ్యస్తంగా మారింది. రావణాపల్లి జంక్షన్ నుంచి పాకలపాడు వెళ్లే రహదారి నాలుగు కిలోమీటర్ల మేర గతుకుల మయం కావడంతో వర్షాలకు నీరు చేరిపోయి చెరువులను తలపిస్తున్నది. దీంతో రాకపోకలకు వాహన చోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పాకలపాడు, పుత్తడిగైరంపేట, దిబ్బలపాలెం, గ్రామాల ప్రజలు ఈ రహ'దారుణం'పై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

కృష్ణాదేవిపేట రోడ్లు ప్రమాదకరం

కృష్ణాదేవిపేట: పాతకృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, చోద్యం, లింగంపేట, కొంగసింగి తదితర గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకల కోసం ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఏఎల్‌పురం ఆర్టీసీ బస్ స్టేషన్‌లో వర్షంనీరు ఎటుపోలేని దుస్థితి ఏర్పడింది. గోతులు వర్షం నీరు చేరడంతో బస్సులు వెళ్లే సమయంలో ప్రయాణికులపై నీరు ఎగిసి పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా రహదారులు
ఎక్కడికక్కడ తేలిపోయిన రాళ్లు.. ఆద్యంతం గతుకులు
వర్షాలు కురిస్తే నీరు చేరి చెరువుల్లా మార్గాలు
పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


బురదమయమైన నాతవరం మెయిన్ రోడ్డు

నాతవరం మెయిన్ రోడ్డు చిత్తడి

నాతవరం: వర్షం వస్తే నాతవరం మెయిన్ రోడ్డు చిత్తడవుతోంది. రహదారి బురదమయం కావడంతో వాహనదారులు జారిపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు అధ్వానంగా ఉందంటూ కూటమి నాయకులు నిరసన తెలిపారు. ఇందులో భాగంగా గోతుల్లో మట్టి వేసి మరమ్మతు చేపట్టాలని డిమాడ్‌చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో మెయిన్ రోడ్డు మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రోలుగుంటలో 'దారు'ణం

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు దారుణంగా మారాయి. వెలంకాయలపాలెం నుంచి రోలుగుంట వరకు ఉన్న బీఎన్ రోడ్డు మరీ అధ్వానంగా తయారైంది. అలాగే కొమరవోలు, వడ్డిప-శరభవరం, భోగాపురం-కొంతలం రోడ్లు శిథిలావస్థకు చేరాయి. గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారులను తక్షణమే మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మాడుగుల రోడ్డు అధ్వానం

మాడుగుల రూరల్: మాడుగుల రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు గతుకుల మయం కావడం... వాటిపై వాడుకనీరు, మురుగునీరుతో పాటు వర్షం నీరు చేరడంతో పరిస్థితి దారుణంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతున్నదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఈ రోడ్డుపై రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.


మాడుగుల రహదారి గతుకుల్లో నిలిచిపోయిన నీరు


గంటాను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ, జనసేన నేతలు

గంటాను కలిసిన టీడీపీ, జనసేన నేతలు

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా నియోజకవర్గానికి చెందిన టీడీపీ, జనసేన ముఖ్య నాయకులు ఆదివారం విశాఖలో గంటాను కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. గంటాను కలిసిన వారిలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, జనసేన నేత సిరిపురపు రమేశ్, టీడీపీ నాయకులు సేనాపతి శ్రీనివాసరావు, సాలాపు నరసింహమూర్తి, స్థానిక నాయకుడు సానబోయిన గోవింద్ తదితరులు ఉన్నారు.

10న రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నీ

సబ్బవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ ఆదివారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల పదో తేదీన గాజువాకలోని జింక్ మైదానంలో ఈ టోర్నమెంటు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తిగల దివ్యాంగులు హాజరు కావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు, పలువురు యువకులు పాల్గొన్నారు.

క్రీడాభారతి అవార్డుకు దరఖాస్తు చేసుకోండి

కొత్తూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడాభారతి అవార్డు నిమిత్తం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అనకాపల్లి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆదివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ, విజయవాడ ఆదేశాల మేరకు నాల్గవ ఆన్‌లైన్‌లో క్రీడా జ్ఞాన పరీక్ష నిర్వహణలో భాగంగా 12 ఏళ్లు పైబడిన క్రీడాకారులు ఎక్సెల్ ఫైల్‌లో రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాలన్నారు. ఈ నెల 8న జరగనున్న ఈ పరీక్షకు ప్రతీ రోజు ఉదయం ఐదు నుంచి సాయంత్రం ఐదు వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 25 నిమిషాల ఈ పరీక్షకు కంప్యూటర్, ల్యాప్‌టాప్, టాబ్లయిడ్, మొబైల్‌లలో పాల్గొనవచ్చన్నారు. దీనికి రూ.20 చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు http://kreedaabharati.org/ ను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

రెండు కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

నర్సీపట్నం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండు కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ రమేశ్ ఆదివారం తెలిపారు. ముందస్తు సమాచారంతో కొత్తబయపురెడ్డిపాలెం బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు రెండు కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారని చెప్పారు. వీరితో పాటు మరో బైక్‌తో పైలట్‌గా వస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. వీరిలో గుంట మోహన్‌రావు, తుచ్చా హేమంత్, గెమ్మిలి యోహాన్ ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

మూడు కిలోల గంజాయితో ఇద్దరు...

అనకాపల్లి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గూడ్స్‌షెడ్ వద్ద ఆదివారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా జన్నారం మండలం మంగం పేటకు చెందిన మన్నే జగదీష్, హుకుంపేట మండలం బొడ్డపుట్టుకు చెందిన తామర లవకుశలు పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి అనకాపల్లికి వచ్చారన్నారు. రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా వారిపై అనుమానం వచ్చి ఎస్ఐ సంతోష్‌కుమార్ తనిఖీలు చేశారన్నారు. మూడు కిలోల గంజాయి లభ్యం కావడంతో స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు.

మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

పరవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మతి స్థిమితం లేని వ్యక్తి నీటి కుంటలో పడి మృతి చెందినట్టు పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు తెలిపారు. పెదగంట్యాడ మండలం మదీనాబాగ్ ప్రాంతానికి చెందిన సుశీల్ టుప్పో (50) వివాహం కాకపోవడంతో సోదరుడి వద్ద ఉంటున్నాడు. గత కొంతకాలంగా మతి స్థిమితం కోల్పోవడంతో తరచూ ఇంటి నుంచి వెళ్లిపోయి మరలా నాలుగైదు రోజులు గడిచాక ఇంటికి చేరేవాడు. ఈ క్రమంలో గత నెల 27న సుశీల్ ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి చేరుకోలేదు. ఇదిలావుంటే, మండలంలోని కలపాక పంచాయతీ పరిధి మూలస్వయంభూవరం గ్రామ సమీపంలోని తుప్పల మధ్య నీటి కుంటలో అతని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పీఏసీఎస్ అవినీతిపై విచారణ చేపట్టాలి

సొసైటీ సభ్యులు సాంభమూర్తి, నారాయణరావు

రోలుగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిరాంపురం పీఏసీఎస్‌లో చోటుచేసుకున్న అవినీతి, బినామీ రుణాలపై సెక్షన్ 51 ప్రకారం సమగ్ర విచారణ జరిపి అవకతవకలపై నిగ్గుతేల్చాలని సొసైటీ సభ్యులు కిల్లాడ సాంభమూర్తి, గొల్లు నారాయణరావు డిమాండ్ చేశారు. ఆదివారం కుసర్లపూడిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా నాలుగు సార్లు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినా ఉత్తుత్తి విచారణలతో మమా అనిపిస్తున్నారని ఆరోపించారు. సంఘంలో కాల పరిమితి పూర్తయిన రుణాలను రికార్డులు తారుమారు చేసి సంఘ సభ్యులకు తెలియపర్చకుండా అసలులో రూ.100 కట్టి బతికిస్తున్నారని, వాటిపై దావాలు వేసి జప్తు నోటీసులను సంఘం సభ్యులకు పంపించి భయభ్రాంతులకు గురిచేసి సొమ్ములు వసూళ్లు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ సొసైటీ పరిధిలోని ఏడు గ్రామాలకు చెందిన 200 మందికి పైగా రైతులకు ఇటీవల జప్తు నోటీసులు పంపించారని, వీరిలో ఎవరూ రుణాలు తీసుకోలేదని వారు తెలిపారు. బినామీ రుణాలు, తీసుకోని రుణాలకు సంబంధించి రూ.2 కోట్లకు పైగా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రెండు పర్యాయాలు విచారణ అధికారి మరిడియ్యా హాజరై సొసైటీ అధికారులతో కుమ్మక్కై సక్రమంగా విచారణ నిర్వహించలేదని వారు ఆరోపించారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో రైతుల సమక్షంలో సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని,ర పీఏసీఎస్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

ఆర్ఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు సత్యనారాయణ

రావికమతం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలను ప్రభుత్వ దేవదాయ, ధర్మదాయ శాఖ నుంచి విముక్తి చేయాలన్న డిమాండ్‌తో నిర్వహించనున్న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు ఓలేటి సత్యనారాయణ పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మేడివాడ నుంచి బుచ్చియ్యపేట మండలం బుదిరెడ్లపాలెం వరకు ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హిందూ దేవాలయాల నిర్వహణలో ప్రభుత్వ పెత్తనం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం గత కొంత కాలంగా విశ్వహిందూ పరిషత్ వివిధ రకాలుగా నిరసనలు తెలుతుందన్నారు. హిందూ దేవాలయాల పరిరక్షణ బాధ్యతను హిందువులకే అప్పగించాలన్నారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధీనంలో నడుస్తున్న దేవాలయాలను హిందువులకు అప్పగిస్తేనే పురోవృద్ధి సాధ్యమన్నారు. అలాగే అన్యమతాల ఉచ్చులో పడే అవకాశం ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు, సమరసత సేవాల ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


రావికమతంలో దేవాలయాల పరిరక్షణకు బైక్ ర్యాలీ చేస్తున్న దృశ్యం


మాడుగుల: ఎం.కోడూరులో తడిచిపోయిన కోసిన వరి పనలు


చీడికాడ మండలం ఖండివరంలో నేలమట్టమైన వరిచేను

తుఫాన్‌తో అన్నదాతకు న(క)ష్టం

వర్షాలతో తడిచిన వరి పనలు
ఈదురుగాలులతో ఒరిగిన వరిచేలు
లబోదిబోమంటున్న రైతులు



మాకవరపాలెంలో కిందపడిన వరిచేను.. గొలుగొండ: పాతమల్లంపేటలో పడిపోయిన వరి చేను

మాడుగుల రూరల్/మాకవరపాలెం/చీడికాడ/గొలుగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అన్నదాతను తుఫాన్ నిలువునా ముంచింది. భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులకు చేతికందే దశలో ఉన్న వరి చేలు నేలకొరిగాయి. కోసిన వరి పనలు తడిచి ముద్దయ్యాయి. మాడుగుల మండలంలోని ఎం.కోడూరు సమీపంలో కోసిన వరి పనలు పొలంలోనే వదిలేయడంతో తడిచిపోయాయి. జంపెనలో వరిచేను తడిచిపోయింది.

అలాగే చీడికాడ మండల కేంద్రంతో పాటు చీడికాడ, ఖండివరం గ్రామాల్లో వరిచేలు నేలమట్టమయ్యాయి. కోతకు వచ్చే సమయంలో తుఫాన్ వల్ల పంటను తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోయారు.

మాకవరపాలెం మండల కేంద్రంతో పాటు తామరం, పైడిపాల, గిడుతూరు, మల్లవరం, నారాయణరాజుపేట, లచ్చన్నపాలెం, తూటిపాల, బూరుగుపాలెం గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. రాచపల్లి, రామన్నపాలెం, జి.కోడూరు గ్రామాల్లో వరి పనలు తడిచాయి. గొలుగొండ మండలంలోని జోగంపేట, పాతమల్లంపేట, గొలుగొండ, రావణాపల్లి, ఏటిగైరంపేట, పాకలపాడు, గుండుపాల, చీడిగుమ్మల, అమ్మపేట గ్రామాల్లో చేతికందే సమయంలో వరి చేను నేలమట్టమైంది. దీంతో తిండి గింజలకు ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

భూలోకమాంబను దర్శించుకున్న తాతయ్యబాబు

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట భూలోకమాంబ ఉత్సవంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.మత్స్యరాజు, సర్పంచ్ బొడ్డేడ రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుపథ ప్రతిభా పరీక్షకు విశేష స్పందన

నర్సీపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సుపథ స్వచ్ఛంద సేవా సంస్థ విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పరీక్షలు విశేష స్పందన లభించింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 'మన విలువలు' అనే అంశంపై వ్యాసరచన, శ్లోక పఠనం, పద్య పఠనం, దేశ భక్తి గేయాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నర్సీపట్నం పరిసర మండలాల నుంచి 320 మంది విద్యార్థులు హాజరయ్యారు. దీనికి ముందు ప్రారంభ ఉపన్యాసంలో ఎంఈవో తలుపులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ, మాతృభాషా సంరక్షణకు సుపథ స్వచ్ఛంద సేవా సంస్థ విశేషంగా పని చేస్తుందని తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు డిసెంబరు 25 బలిఘట్టం పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో సహజీవన యోగ సదస్సులో బహుమతులు ప్రదానం చేస్తామని రమణమాస్టారు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా బాబీ మాస్టారు, ఏవీఎస్ ప్రకాశం, కామేశ్వరం మాస్టారు, కనకరాజు మాస్టారు, బీవీ రామయ్య వ్యవహరించారు.

దివ్యాంగుల ప్రత్యేక సమావేశం రేపు

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం దివ్యాంగు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు సంఘం మండల అధ్యక్షుడు శరగడం నాగభూషణం తెలిపారు. ఈ సమావేశంలో అర్హులైన దివ్యాంగులకు వీల్ చైర్లు, బ్యాటరీ సైకిళ్లు, స్కూటీలు అందిస్తామన్నారు. అలాగే విశాఖ స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ ఆధ్వర్యంలో బస్సు పాసులు, రైల్వే రాయితీలు అందించనున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి సభ్య దివ్యాంగులంతా హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

హామీలు నెరవేర్చకపోతే ప్రజాగ్రహం తప్పదు

ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు సూపర్‌సిక్స్ పేరుతో వాగ్దానాలు ఇచ్చి, ఇపుడు ప్రజలను వంచిస్తున్నదని విమర్శించారు. విద్యుత్ చార్జీలను పెంచేది లేదంటూ ఇచ్చిన హామీని తుంగలో తొక్కి, ఇప్పటికే రెండుసార్లు ట్రూఅప్ చార్జీలు పెంచి మోయలేని భారం వేసిందని ఆయన ఆరోపించారు. విలేకరుల సమావేశంలో వైసీపీ జిల్లా నేత ఏడువాక సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణకు పంచనామా నిబంధనలు సడలించాలి: సీపీఎం జిల్లా నేత వెంకన్న

దేవరాపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) కుల ధ్రువీకరణ పత్రాలకు పంచనామా తప్పనిసరి అంటూ నిబంధనలు పెట్టడంతో రాజకీయ నాయకులు వద్దకు విద్యార్థులు వెళ్లాల్సి వస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ కులానికి చెందిన వారైనా పంచనామా, సర్పంచ్‌తో పాటు మరో నలుగురి సంతకాలు, వారి ఆధార్ కార్డులు జెరాక్సు కాపీలు జత చేయాలన్న కొత్త నిబంధన పెట్టడంతో సచివాలయంలో దరఖాస్తులు తీసుకోవడం లేదని చెప్పారు. దీనివల్ల పింఛన్ తీసుకోవాలన్నా, విద్యార్థి ఉన్నత చదువులకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ నిబంధనలను సడలించాలని ఆయన డిమాండ్ చేశారు.

కేన్సర్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నాతవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపల్లి గ్రామానికి చెందిన పంచాడ కావ్య అనే బాలిక ఇటీవల కేన్సర్‌తో మృతి చెందడంతో, ఆమె కుటుంబానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల విజయ్ రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. మృతురాలు కావ్య తల్లి వరలక్ష్మికి స్థానిక టీడీపీ నాయకుడు శివ ఆధ్వర్యంలో ఈ మొత్తాన్ని అందజేశారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీలు



మాడుగులలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

మాడుగుల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఆదివారం హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మాడుగులలోని సామాజిక ఆస్పత్రి వైద్యులు, ఐసీటీసీ సిబ్బంది ఆధ్వర్యంలో బీసీ హాస్టల్ విద్యార్థినులతో ఈ ర్యాలీ సాగించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. సమాజంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపరాదని, వ్యాధి నివారణకు జాగ్రత్తలు పాటించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంతోశ్, శ్రీనివాసు, సిబ్బంది శ్రీనివాసు, గోవింద్, నరేంద్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెంపేట గ్రామంలో ఆదివాం హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో వివిధ నానాదాలతో ఈ కార్యక్రమం చేపట్టారు. హెచ్ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవీ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను స్కీం కౌన్సిలర్ ఎం.గణేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

కె.కోటపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమని సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి శ్రీలక్ష్మి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యన్న జూనియర్ డిగ్రీ విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఎయిడ్స్‌ను అంతం చేయడానికి సామాజిక బాధ్యతతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, కోటేశ్వరరావు, సునీల్, రెడ్డి రమ, జి.వి.వైదేహి, నందకిశోర్, ఐసీటీసీ కౌన్సిలర్ దేవుడుబాబు, అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసీం, ఎన్ఎస్ఎస్ పీవోలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రమేశ్

ముంచంగిపుట్టు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుజనకోట పంచాయతీ కొత్త సుజనకోట గ్రామంలో సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ వి.రమేశ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీపీ నిధులు రూ.2. 20లక్షలతో 50 మీటర్లు సీసీ రోడ్డు పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎం.సుబ్బలక్ష్మీ, సీపీఎం నేత గాసీరాందొర తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రాక్టికల్స్



ఘన జీవామృతం తయారీలో విద్యార్థులు

చింతపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సేంద్రీయ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పరిశోధన స్థానంలో సేంద్రియ ఎరువు ఘన జీవామృతం తయారు చేశారు. కళాశాలలో రెండో ఏడాది విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు మూడో సెమిస్టర్ ప్రాక్టికల్స్‌లో భాగంగా స్వయంగా పంటలు పండించాల్సివున్నది. ఈమేరకు ఆవరణలో సేంద్రీయ పద్ధతిలో కూరగాయల సాగు చేపడుతున్నారు. ఈమేరకు టీచింగ్ అసోసియేట్ కె. బాలాజీ నాయుడు పర్యవేక్షణలో పాలిటెక్నిక్ విద్యార్థులు కూరగాయల పంటకులకు అవసరమైన ఘన జీవామృతం, నీమాస్త్ర, కషాయం సిద్ధం చేశారు. ఈసందర్భంగా టీచింగ్ అసోసియేట్ మాట్లాడుతూ విద్యార్థులు ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయల సాగులో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు.

ఏపీయూఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా బాబూరావు



బాబూరావుకు నియామకపత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

పాడేరురూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎంపిక చేస్తూ తుడుము బాబూరావుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ నియామకపత్రాన్ని అందించారు. పాడేరులో ఆదివారం ఏపీయూఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలాజీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల అపరిష్కృతం సమస్యలు పరిష్కారంలో తమ సంఘం ముందుంటుందన్నారు. జిల్లాలో సంఘాన్ని బలోపేతానికి సంఘ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎంపీ శ్రీనివాసరావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చిన్ని చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు సాగేని సత్యనారాయణ, నాయకులు కిల్లో అప్పలరాజు, డి.సూరిబాబు, వి.కృష్ణవేణి, డి.నవీన్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏపీఎఫ్‌డీసీ ఫీల్డ్‌మన్ మృతి



కామేశ్వరరావు(ఫైల్)

గూడెంకొత్తవీధి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిబాల గ్రామానికి చెందిన ఏపీఎఫ్‌డీసీ ఫీల్‌మన్ చల్లంగి కామేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. కామేశ్వరరావు వారం రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం మైదాన ప్రాంతాలకు తీసుకు వెళ్లారు. ఆదివారం ఉదయం ఆయన చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

వారపు సంతల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ముంచంగిపుట్టు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు జోలాపుట్టు, లక్ష్మీపురం , బంగారుమెట్ట, బూసిపుట్టులో జరిగే వారపు సంతల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ .. సంతల్లో సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. వారపు సంతల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్టు అధికారులు చెబుతున్నా- కార్యాచరణ మాత్రం కానరావడంలేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సంతల్లో షెడ్లు, మరుగుదొడ్లు నిర్మించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, విశ్రాంతి భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన బాటపడతామని ఆయన హెచ్చరించారు.

చెట్టు కింద చదువులు

- అనంతగిరి మండలం బురిగ గ్రామంలో చిన్నారుల అవస్థలు



చెట్టు కింద టార్పాలిన్ రక్షణలో చదువుకుంటున్న చిన్నారులు



పునాదుల వరకు పరిమితమైన బూరిగ ఎంపీపీ పాఠశాల భవనం

అనంతగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చెట్టుకింద బురిగ గ్రామంలో చిన్నారులు చదువు సాగుతున్నాయి. ఏజెన్సీ వ్యాప్తంగా డ్రాపవుట్స్ లేకుండా చూడాలని విద్యా శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి అంటూ ఏటా ప్రచారం సాగించడం మినహా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మండలంలోని రొంపిలి పంచాయతీ బురిగ గ్రామంలో ఎంపీపీ పాఠశాలకు భవనం లేక పోవడంతో విద్యార్థులు చెట్టు కింద టార్పాలిన్ వేసుకుని చదువులు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం వర్షం పడడంతో తడుస్తూ చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2012-2013 సంవత్సరంలో ఈ పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే పునాదుల వరకు నిర్మించి అంతటితో నిలిచి పోయాయి. దీంతో ఈ పాఠశాలలో చదువుతున్న బూరిగ, చిన కోనెల గ్రామాలకు చెందిన 35 మంది విద్యార్థులు నిలువనీడ కరువై అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే భవణం పూర్తి చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

275 కేజీల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు, రెండు ఆటోలు, బైక్ సీజ్



గంజాయి నిందితులతో పోలీసులు, రెవెన్యూ అధికారులు

పెదబయలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి పర్రెడా జంక్షన్‌లో ముగ్గురిని అరెస్టు చేసి 275 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పెదబయలు ఎస్‌ఐ కె. రమణ తెలిపారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు ఆటోలు, ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్టు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నవంబరు 30వ తేదీన ఆటోల్లో గంజాయి తరలిస్తున్నట్టు ముందస్తు సమాచారం మే రకు పర్రెడా జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో రూడకోట వైపు నుంచి పెదబయలు వైపు వస్తున్న రెండు ఆటోలను నిలిపి తనిఖీలు చేయగా, బస్తాల్లో గంజాయి లభ్యమైంది. ఘటనా స్థలంలో రెవెన్యు అధికారుల సమక్షంలో గంజాయిని తూనిక వేయగా 275 కిలోలుగా తేలింది. ఆటోల్లో ఉన్న ఇద్దరితోపాటు పైలట్‌గా వ్యవహరించిన ద్విచక్రదారుడిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులు ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, బోడపడ గ్రామానికి చెందిన దంబారు తుంగల్, చిత్రకొండ బ్లాక్ జోలియం గ్రామానికి చెందిన మోహన్ కెముడు, పెదబయలు మండలం వనభంగి పంచాయితీ దంబోగూడ గ్రామానికి చెందిన కొర్ర బాబురావులపై ఎన్‌డీపీఎస్ కేసు నమోదు చేశారు. జి. మాడుగుల ఇన్‌చార్జి సీఐ సన్యాసి నాయుడు ఆదేశాల మేరకు వీరిని కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్‌ఐ రమణ తెలిపారు. గంజాయిని ఒడిశాలో కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నట్టు ఆయన తెలిపారు.

రోడ్ల విస్తరణ అడ్డగింత కుట్రపూరిత చర్య



మాట్లాడుతున్న ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర

పాడేరురూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంతంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ఆదివాసీయేతరులు అడ్డుకోవడం తగదని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర మండిపడ్డారు. స్థానిక గిరిజన భవన్‌లో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడేరు పట్టణంలో ఆదివాసీల అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్న వర్తక సంఘం నాయకులపై టీడీపీ నాయకుడు పోలుపర్తి గోవిందరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరితో కలిసి ఏజెన్సీ చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతున్న వర్తక సంఘం నాయకుల షాపుల ఎదుట కొనుగోళ్ల నిరాకరణ బోర్డులు ఏర్పాటుకు సమావేశంలో తీర్మానించామన్నారు. ఈ విషయంపై సోమవారం కలెక్టర్, ఎస్పీలను కలిసి ఫిర్యాదు చేయనున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఎస్.గంగరాజు, బి.సింహాచలం, టి.ప్రసాద్ నాయుడు, కె.సురేశ్, వందేమాతరం శ్రీను, బుడిదే మాధవరావు, కిశోర్, బాబూజీ, అనిల్, శేఖర్, ఎల్.గోపాలపాత్రుడు, కె.తెల్లబాబు, భాస్కరరావు, వి.సూరిబాబు, ఎం.కృష్ణపడాల్, ఎస్.సంజీవరావు పాల్గొన్నారు.

రహదారి విస్తరణను అడ్డుకోలేదు: వర్తక సంఘం నాయకులు

పాడేరురూరల్: పాడేరులో ప్రధాన రహదారులు విస్తరణకు వర్తక సంఘం ఎటువంటి అడ్డంకులు కల్పించడం లేదని వర్తక సంఘం అధ్యక్షుడు ఇమిడిశెట్టి అనీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాలు, గృహాలను ప్రభుత్వం నిర్ణయించిన మేరకు తొలగించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రహదారి విస్తరణపై వస్తున్న ఆరోపణలపై ఈ మేరకు వారు ఆదివారం వివరణ ఇచ్చారు.

వృద్ధురాలికి నేను సైతం చారిటబుల్ ట్రస్టుసాయం

కొయ్యూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో బట్టపణుకుల పంచాయతీ శివారు లంకవీధి గ్రామంలో వృద్ధురాలు ఇరటా రాములమ్మ నేను సైతం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కుశిరెడ్డి శివప్రసాద్ రూ. 5వేలు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందించారు. అనాథగా పూరిపాకలో జీవనం సాగిస్తున్న రాములమ్మ జీవనం సాగిస్తున్నట్టు తెలుసుకుని ఈ సాయం చేసినట్టు శివ ప్రసాద్ తెలిపారు.

పాడేరు ఆర్టీసీ డిపోలో సమస్యలు పరిష్కరించాలి

- ఆర్టీసీ రీజినల్ చైర్మన్ దొన్నుదొరకు ఎన్‌ఎంయూ వినతి



ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్నుదొరను సన్మానిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని ఆర్టీసీ డిపోలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) చైర్మన్ తురక గంగాధరరావు ఆధ్వర్యంలో నాయకులు ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ ఎస్.దొన్నుదొర ఆదివారం వినతిపత్రమందించారు. ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దొన్నుదొరను ఆయన నివాస గృహం అరకులో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా డిపోలో నెల కొన్న సమస్యలను వివరించారు. కొత్త బస్సులు సమకూర్చాలని పాతబస్సుల మరమ్మతులకు సరిపడే సామగ్రిని గ్యారేజ్‌లో అందించాలని కోరారు. అన్ని విభాగాల్లో మెకానిక్‌లను నియమించాలని, డిపోలోని బస్సు సర్వీసులను 40 నుంచి 60 వరకు పెంచి ప్రజలకు అందుబాటులో సేవలుంచాలన్నారు. ఉద్యోగులు, కార్మికులకు బకాయి ఉన్న ఇంక్రిమెంట్‌లు, వివిధ రాయితీలు సకాలంలో చెల్లించాలని, ఉద్యోగుల క్వార్టర్స్ మరమ్మతులు చేపట్టాలన్నారు. పాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరం బస్టాండ్‌లలో కనీస సౌకర్యాలు కల్పించాలని, జోలాపుట్టు, అన్నవరం, భద్రాచలం, లోతేరు, బస్కీ, గుంటసీమ తదితర నైట్ అవుట్ సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. పాడేరు డిపో ఉద్యోగులు, కార్మికులకు పాడేరు ప్రభుత్వం ఆస్పత్రిలో వైద్య సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ కేఎస్ చలం, వైస్‌ప్రెసిడెంట్ పీవీ.కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ ఎస్ఎస్.బాబు, గ్యారేజీ కార్యదర్శి వాసుదేవ, జి.రాము, డీఎస్.రావు పాల్గొన్నారు.

అరకులోయ: దొన్నుదొరను అల్లూరి జిల్లా మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు కె.చలం, ఎస్టీఎస్టీ గిరిజన సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్, సభ్యులు కలసి ఆదివారం ఘనంగా సన్మానించారు. తాను త్వరలో అన్ని డిపోల్లో పర్యటించి సమస్యలపై చర్చిస్తామని దొన్నుదొర హామీ ఇచ్చారు.

మెలకువలు పాటిస్తే కాఫీ అధిక దిగుబడి



కాఫీ తోటల్లో శిక్షణనిస్తున్న వ్యవసాయ సిబ్బంది

జి.మాడుగుల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శిక్షణతో కూడిన కాఫీ సాగులో అధికదిగుబడి సాధ్యమని స్టేట్ రిసోర్స్ పర్సన్ కృష్ణారావు, డీపీఎం లాలం భాస్కరరావు సూచించారు. ఎం. నిట్టాపుట్టు ఎఫ్‌పీవో సీఈవో గంగరాజు ఆధ్వర్యంలో ఆదివారం మండలంలో పలు గ్రామాలకు సాగులో మెలకువల్లో శిక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వాణిజ్య పంట కాఫీ అధిక దిగుబడి, ఆదాయం విధానాలను వివరించారు. కోత దశలో పండ్లను కోసే విధానం, పాటించే పద్ధతులపై ఆర్‌పీఎస్ కృష్ణారావు రైతులకు వివరించారు. అలాగే ఈ శిక్షణ మరో మూడు రోజుల పాటు పలు గ్రామాల్లో నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనిటీ ఇన్‌చార్జీ మేడ ప్రసాద్, ఎంటీ రామలింగం, జె.కృష్ణరావు, మహేశ్వరి, కొండబాబు, కృష్ణమోహన్, రజియాబేగం, ఎం.రాంబాబు, సన్యాసిరావు, కృపవరం, ఇమ్మాన్యుయల్, బాలకృష్ణ, ఎంపీటీసీ చిన్నారావు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఇన్‌ఛార్జి డీడీ ఎన్నికల నిబంధనల ఉల్లంఘన

14 మందికి అక్రమ డిప్యుటేషన్లు.. అధికారులకు ఆదివాసీ సంఘం ఫిర్యాదు

రంపచోడవరం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా.. రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ ఒకరు అక్రమాలకు పాల్పడి 14 మంది సిబ్బందిని డిప్యుటేషన్లపై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంపై ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం వెలుగులోకి తెచ్చింది. అనంతరం ఎన్నికల సంఘానికి, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. మీడియాకు అందించిన ఈ వివరాలిలా ఉన్నాయి. గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయానికి అనుబంధంగా నడుస్తోంది. ఈ డిప్యూటీ డైరెక్టర్ పోస్టు గత కొన్నేళ్లుగా ఇన్‌చార్జిలతోనే నడుస్తోంది. ఇటీవల ఈ పోస్టుకు వేరే అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. సదరు అధికారి రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారుల నుంచి ఎటువంటి ఆమోదాలు తీసుకోకుండానే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుండగా, తన కార్యాలయం నుంచి డిప్యుటేషన్లపై బదిలీలు చేపట్టారు. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున ముడుపులు ఆయా అధికారులకు, కార్యాలయం సిబ్బందికి ముట్టాయని ఆదివాసీ సాంస్కృతిక సంఘం నాయకులు కత్తుల ఆదిరెడ్డి, తాడే రాజబాబు ఆరోపించారు. తక్షణం సదరు అధికారిని డీడీ బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

ప్రేమ విఫలం.. యువకుడి ఆత్మహత్య



సుబ్రహ్మణ్యం (ఫైల్)

ముంచంగిపుట్టు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి దారెల పంచాయతీ కేంద్రానికి చెందిన సీహెచ్. సుబ్రహ్మణ్యం (33) అనేగిరిజన యువకుడు ప్రేమ విఫలం కావడంతో మనస్తాపంతో శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యులందించిన వివరాలివి.. గత మూడేళ్లుగా ఒక యువతిని సుబ్రహ్మణ్యం ప్రేమించాడు. వారి పెళ్లి వరకు వచ్చి చివరి దశలో రద్దయింది. దీంతో అతను మానసిక ంగా ఒత్తిడికి లోనై ఇంటి వెనుకనున్న చెట్టుకు ఉరేసుకున్నారు. స్థానిక ఎస్‌ఐ జె.రామకృష్ణ ఆదివారం దారెల గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించారు. తన ఆత్మహత్యకు ప్రేమ విఫలమే కారణమంటూ ఆయన సు బ్రహ్మణ్యం జేబులో లభించిన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

లివిటిలో శిశు మరణాలపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ

- డీఎంహెచ్‌వో జమీల్ బాషా



లివిటిలో చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జమీల్ బాషా

పాడేరురూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హుకుంపేట మండలం లివిటి గ్రామంలో శిశుమరణాలకు గల కారణాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీని నియమించి అనంతరం ఆ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా తెలిపారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'లివిటిలో ఏడాదిలో 16 మంది శిశువుల మృతి' అనే శీర్షికన వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. హుటాహుటీన ఆదివారం లివిటి గ్రామాన్ని సందర్శించారు. కొన్ని నెలలుగా గ్రామంలో మృతి చెందిన చిన్నారుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. శిశువు మృతికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. ఇంటింటి సందర్శనలో భాగంగా చిన్నారులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఆయన గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలతో బూత వైద్యులతో వైద్యం చేయించడం, పసర మందులు పట్టడం, చిన్నారుల కడుపుపై కాల్చడం, శ్వాసకోశ వ్యాధులు సోకితే ఆముదపు నూనెతో పొట్ట కాపడం, తల్లి పాలు పట్టిన తరువాత బిడ్డను ఊయల లేదా మంచంపై పడుకోబెట్టడం వల్ల ముక్కు నుంచి లేదా నోటి నుంచిపాలు రావడం వల్ల ఊపిరితిత్తులలోనికి పాలు వెళ్తాయన్నారు. ఈ సమయంలో ఆస్పత్రికి తీసుకువెళ్లకుండా అశ్రద్ధ చేయడం, తదితర వాటి వల్ల శిశు మరణాలు సంభవించే అవకాశాలు ఉంటాయని వివరించారు. వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనారోగ్యానికి లోనైతే ఆస్పత్రులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుల్లెలి సింహాద్రి, క్షయ పర్యవేక్షకులు కె.సదానందం, ఉప్ప పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీ సమేత సిద్ధి సంఘమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



సంగోడిలో మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

పాడేరురూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసపు బహుళ చతుర్దశి తాత్కాల అమావాస్యను పురస్కరించుకుని మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలోని పార్వతీ సమేత సిద్ధి సంఘమేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి మృత్యుంజయ హోమం, సహస్ర దీపాలంకరణ, స్ఫటిక లింగమూర్తికి కర్పూరజ్యోతి హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కార్తీక దీపాలను వెలిగించి మహా శివుని జ్యోతి దర్శనం చేసుకున్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

చింతపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని ఆర్‌వీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు పాత బస్టాండ్ నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌కి మందులేదని, నివారణ ఒక్కటే మార్గం, అపరిచిత శృంగారానికి దూరంగా ఉండాలని నినాదాలు చేశారు.

గ్యాస్ లీకేజీ బాధితులకు అండగా బీజేపీ

జి.మాడుగుల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):కె.కోడాపల్లిలో వంట గ్యాస్ లీకేజీ బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్ల రామకృష్ణ తెలిపారు. మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ కేం ద్రంలో సోమెలి భాస్కరరావు, సింహాచలం సోదరులు నివాసముంటున్న ఇల్లు వంట గ్యాస్ సిలిండర్ ప్రమాదానికి గురై ధ్వంసమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు ఆదివారం బాధిత కుటుంబాలకు నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. బీజేఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మత్స్యకొండబాబు మాట్లాడుతూ, ఈ ఘటనపై పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌తో ఫోన్లో వివరించామన్నారు. తక్షణ సహాయంపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.గ్యాస్ ఏజెన్సీ స్పందించి పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాలపాత్రుడు, సింహాచలం, సూరిబాబు పాల్గొన్నారు.

ముప్పు తప్పినా.. అప్రమత్తం!

... 5వ పేజీ తరువాయి

, రాంబిల్లి, ఎస్.రాయ వరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో మత్స్యకారులు ఆదివారం కూడా సముద్రంలో చేపలవేటకు వెళ్లలేదు.

వర్షపాతం వివరాలు

జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా రాంబిల్లి మండలంలో 37.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాలను పరిశీలిస్తే.. నక్కపల్లిలో 35.6 మి.మీ.లు, ఎస్.రాయవరంలో 31.8, నాతవరంలో 31.4, పాయకరావుపేటలో 31.4, సబ్బవరంలో 27.6, అచ్యుతాపురంలో 27.4, ఎలమంచిలిలో 25.2, పరవాడలో 23.8, బుచ్చెయ్యపేటలో 22.6, చోడవరంలో 22.2, మునగపాకలో 20.8, గొలుగొండలో 18.2, దేవరాపల్లిలో 16.8, కోటవురట్లలో 16.4, కశింకోటలో 16.4, రావికమతంలో 16.2, కె.కోటపాడులో 16.2, అనకాపల్లిలో 15.2, మాకవరపాలెంలో 14.8, మాడుగులలో 13.8, నర్సీపట్నంలో 12.6, రోలుగుంటలో 12.4, చీడికాడలో 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నర్సీపట్నం ఆస్పత్రిలో వైద్యుల కొరత

... 5వ పేజీ తరువాయి

వున్నప్పుడు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిని వంద పడకల నుంచి 150 పడకలకు అప్‌గ్రేడ్ చేసింది. ఆ మేరకు వైద్య నిపుణులను నియమించడానికి ఏర్పాట్లు చేస్తుండగా.. వైసీపీ అధికారంలోకి వచ్చింది. తరువాత ఐదేళ్లపాటు వైద్య నిపుణులను నియమించలేదు. పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో కొన్ని విభాగాల నిపుణుల సేవలు అందని పరిస్థితి ఏర్పడింది. ఉన్న వైద్యులతోనే సేవలను కొనసాగిస్తూ వచ్చారు. ప్రస్తుతం వైద్య నిపుణులతోపాటు సిబ్బంది కొరత కారణంగా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదని విమర్శలు వస్తున్నాయి. రాత్రి సమయంలో వచ్చిన కేసుల్లో అత్యధికంగా విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారని పలువురు రోగులు ఆరోపిస్తున్నారు.

సగం పోస్టులు ఖాళీ

పేరుకు 150 పడకల ఆస్పత్రి.. కానీ వంద పడకల ఆస్పత్రికి ఉండాల్సిన వైద్యులు కూడా పూర్తి స్థాయిలో లేరు. గైనికాలజీ, చర్మవ్యాధులు, దంత, చిన్న పిల్లలు, నేత్ర, ఈఎన్‌టీ, ఎముకల వైద్య నిపుణులు ఉన్నారు. జనరల్ మెడిసిన్, రేడియాలజీ, డిప్యూటీ సివిల్ జర్జన్ (జనరల్), ఎన్‌డీసీ మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీలు ఉన్నాయి. రేడియాలజిస్ట్ లేకపోవడంతో స్కానింగ్ సెంటర్ పూర్తిగా మూత పడింది. స్కానింగ్ విభాగంలో గర్భిణులతోపాటు వివిధ సమస్యలతో వచ్చిన వారికి స్కానింగ్ పరీక్షలు చేసేవారు. రేడియాలజిస్ట్ లేక స్కానింగ్ సెంటర్ మూతపడడడంతో రోగులు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో లేరు. ప్రతి వంద పడకలకు 24 మంది చొప్పున నర్సింగ్ స్టాఫ్ వుండాలి. ఈ ప్రకారం 150 పడకల ఆస్పత్రికి 36 మంది నర్సింగ్ సిబ్బంది అవసరం. కానీ ప్రస్తుతం 23 మంది మాత్రమే వున్నారు. దీనివల్ల ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి అధికంగా వుంది. అత్యవసర సమయాల్లో సెలవు తీసుకోవడానికి వీలు కావడం లేదని వాపోతున్నారు.

వెలుగు సీసీ సస్పెన్షన్

... 5వ పేజీ తరువాయి

స్వాహా అయినట్టు నిగ్గు తేల్చారు. వీవోఏ వరలక్ష్మికి సీసీ తాతబాబు సహకారంతోనే నిధులు స్వాహా అయినట్టు నిర్ధారించారు. దీంతో ఆయనను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తాతబాబు ప్రస్తుతం చీడికాడ మండలం చుక్కపల్లి సీసీగా విధులు నిర్వహిస్తున్నారు. అప్పట్లో ఇక్కడ పనిచేసిన వెలుగు అధికారుల పాత్రపైనా విచారణ జరిపిస్తే మరిన్ని అవతవకలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా దారి మళ్లించిన డ్వాక్రా సభ్యుల రుణాలు, స్త్రీ నిధి డబ్బులను వెనక్కి ఇస్తానని అధికారుల ఎదుట అంగీకరించిన వీవోఏ వరలక్ష్మి.. ఇంతవరకు సొమ్ములు తిరిగి ఇవ్వకపోవడంతో బాధిత మహిళలు డీఆర్‌డీఏ, పోలీసు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఇంకా పరాయి పంచనే..!

... 5వ పేజీ తరువాయి

చెప్పాల్సిన అవసరం లేదు. జిల్లా కేంద్రం ఏర్పడక ముందు అనకాపల్లి పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేదా ఫ్లాట్ రూ.7 వేల అద్దెకు లభించేవి. జిల్లా ఏర్పడిన తరువాత రూ.10 వేలకు పెరిగింది. దీంతో చాలామంది ఉద్యోగులు విశాఖపట్నంలో సొంత ఇళ్ల వుండడం, పిల్లల చదువుల కారణంగా అక్కడి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఇక కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులు కార్యాలయానికి చేరుకొనేందుకు సరైన రవాణా సదుపాయం లేకపోవడంతో అధిక చార్జీలు చెల్లించి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు: యువతి దుర్మరణం

... 5వ పేజీ తరువాయి

వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా ఎస్.రాయ వరం మండలం గోకులపాడు సమీపంలోకి వచ్చేసరికి అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో సంతోష్, ప్రశాంతిలకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న వ్యక్తులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. కొద్దిసేపట్లో అంబులెన్స్ వచ్చి క్షతగాత్రులను నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రశాంతి తలకు తీవ్రగాయం చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

క్రీడాభారతి అవార్డుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానం

కొత్తూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : క్రీడాభారతి అవార్డు నిమిత్తం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అనకాపల్లి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్‌వీ రమణ ఆదివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ, విజయవాడ ఆదేశాల మేరకు నాల్గవ ఆన్‌లైన్‌లో క్రీడా జ్ఞాన పరీక్ష నిర్వహణలో భాగంగా 12 ఏళ్ళు వయస్సు పైబడిన క్రీడాకారులు ఎక్స్‌ఎల్ ఫైల్‌లో రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాలన్నారు. ఈ నెల 8న జరగనున్న ఈ పరీక్షకు ప్రతి రోజు ఉదయం ఐదు నుంచి సాయంత్రం ఐదు వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 25 నిమిషాల ఈ పరీక్షకు కంప్యూటర్, ల్యాప్‌టాప్, టాబ్లయిడ్, మొబైల్‌లలో పాల్గొనవచ్చన్నారు. దీనికి రూ.20 చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో http://kreedaabharati.org/ ను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ క్రీడా పరీక్షలో మొదటి అవార్డుకు రూ.10 లక్షలు (ఒక్కరికి), రెండవ అవార్డు రూ.50 వేలు (ఇద్దరికి), మూడవ అవార్డు రూ.25వేలు (ముగ్గురికి), నాల్గవ అవార్డు రూ.11వేలు (11మందికి) ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ, పట్టణ పరిధిలో ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

10న రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేష్‌రాజ్ తదితరులు

సబ్బవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ ఆదివారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల పదో తేదీన గాజువాకలోని జింక్ మైదానంలో ఈ టోర్నమెంటు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తిగల దివ్యాంగులు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు పలువురు యువకులు పాల్గొన్నారు.

మూడు కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు



నిందితులను చూపుతున్న సీఐ,ఎస్ఐ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఇక్కడి గూడ్స్‌షెడ్ వద్ద ఆదివారం పట్టుకుని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం మంగంపేటకు చెందిన మన్నే జగదీష్, హుకుంపేట మండలం బొడ్డపుట్టుకు చెందిన తామర లవకుశలు పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి అనకాపల్లికి వచ్చారన్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా వారిపై అనుమానం వచ్చి ఎస్ఐ సంతోష్‌కుమార్ తనిఖీలు చేశారన్నారు. మూడు కిలోల గంజాయి లభ్యం కావడంతో స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు.

'ఆవు పాల సేకరణ ధర పెంచాలి'

కశింకోట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం డెయిరీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పాల రైతుల సంఘం రాష్ట్ర నాయకుడు కర్రి అప్పారావు తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం, బయ్యవరం, జోగారావుపేట, నర్సింగబిల్లి, తేగాడ, కశింకోట తదితర గ్రామాల పాడి రైతులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెల 29న జరిగిన ధర్నాలో జీఎం ఇచ్చిన ఒప్పందాన్ని అమలు చేయాలని కోరారు. పాడి రైతుల చెమట కష్టంతో విశాఖ డెయిరీకి వేల కోట్లు ఆస్తులు సమకూరాయన్నారు. మార్కెట్లో కూడా మంచి బ్రాండ్ ఇమేజ్ వచ్చిందని అయినప్పటికీ అభివృద్ధిలో వచ్చిన ఫలాలు ఏపీ పాల రైతులకు దక్కకుండా దారిమళ్లిస్తున్నారని ఆరోపించారు. విశాఖ డెయిరీలో రైతులకు 250కోట్లు షేర్ క్యాపిటల్ ఉన్నప్పటికీ డివిడెంట్లు రైతులకు ఇవ్వలేదన్నారు. డెయిరీపై వచ్చిన కథనాల ప్రకారం జరిగిన అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డి.డి.వరలక్ష్మి, జి.ప్రసాద్, వెంకటరమణ, ఎ.రమణ, టి.రాజు, జి. నాగశేషు, టి. దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

- మృతుడు పెదగంట్యాడ మండలం మదీనాబాగ్‌కు చెందినసుశీల్
- కలపాక పంచాయతీ పరిధి నీటి కుంటలో మృతదేహం గుర్తింపు

పరవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మతి స్థిమితం లేని వ్యక్తి నీటి కుంటలో పడి మృతిచెందిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ జి. మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి. పెదగంట్యాడ మండలం మదీనాబాగ్ ప్రాంతానికి చెందిన సుశీల్ టుప్పో (50) అనే వ్యక్తి అవివాహితుడు. తన సోదరుడి వద్దనే ఉంటున్నాడు. గత కొంతకాలంగా మతి స్థిమితం కోల్పోవడంతో తరచూ ఇంటి నుంచి వెళ్లిపోయి మరలా నాలుగైదు రోజులు గడిచాక ఇంటికి చేరేవాడు. ఈ క్రమంలో గత నెల 27న సుశీల్ ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి చేరుకోలేదు. ఇదిలావుంటే, మండలంలోని కలపాక పంచాయతీ పరిధి మూలస్వయంభూవరం గ్రామ సమీపంలోని తుప్పల మధ్య ఉన్న నీటి కుంటలో అతని మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని చూసిన పోలీసులు రెండు మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చునని అభిప్రాయపడుతున్నారు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్‌ల శాఖ సేవలు సులభతరం



అనకాపల్లి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్‌ల శాఖ అందిస్తున్న పలు రకాల సేవలు ఇక మరింత సులభతరమయ్యాయి. ఇప్పుడు ఎంకంబరెన్స్ సరిఫికేట్ (ఈసీ), సర్టిఫైడ్ కాపీ, (సీసీ)ల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. పౌరులు నేరుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆన్‌లైన్ విధానంలో అవసమైన రుసుం స్టాంపుల రిజిస్ట్రేషన్‌ల శాఖకు చెల్లిస్తే క్షణాల వ్యవధిలో ఆయా సేవలు పొందవచ్చు. ప్రస్తుతం ఈ ప్రక్రియలో మధ్యవర్తుల ప్రమేయం ఉండబోదని అధికారులు చెబుతున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు కూడా..

ఆన్‌లైన్ సేవలు అందుబాటులో లేని గ్రామీణ ప్రాంతాల్లో కూడా మీసేవా కేంద్రాల ద్వారా ఆయా కాపీలను అందుకోవచ్చు. దానికి ఎలాంటి పరిమితులు లేవు. గతంలో వీటి కోసం మీసేవలో దరఖాస్తు చేశాక, అది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకొని అక్కడ తగిన అనుమతులు పొందిన తర్వాత మీసేవల్లో మాత్రమే డాక్యుమెంట్‌లను పొందగలిగేవారు. ఫలితంగా మితిమీరిన కాలయాపన జరిగేది. దరఖాస్తు దారుడు రోజుల తరబడి వేచి చూడాల్సివచ్చేది. ఇప్పుడు ఆపరిస్థితి లేకుండా తక్కువ సమయంలో డాక్యుమెంట్లు చేరనున్నాయి.

ఆన్‌లైన్ విధానంతో సత్ఫలితాలు

గతంలో ఈసేవలు పొందేందుకు ప్రతి పౌరుడు మీసేవా కేంద్రానికి వెళ్లాల్సివచ్చేది. కూటమి అధికారంలోకి వచ్చాక ఈశ్రమను సైతం తగ్గించాలని నిర్ణయించింది. ఫలితంగా అందుబాటులోకి వచ్చిన ఆన్‌లైన్ విధానం సత్ఫలితాన్ని ఇస్తుంది. నిర్ణీత దరఖాస్తు పూరించి దాన్ని సబ్ రిస్ట్రార్ కార్యాలయంలో, లేదా మీసేవా కేంద్రాలకు తీసుకువెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇందు కోసం స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్‌ల శాఖ తన వెబ్‌సైట్ ద్వారా చెల్లింపు గేట్‌వేను అభివృద్ధి పరిచింది. ఇది మంచి ఫలితాన్ని ఇవ్వడంతో ఈసీ, సీసీ కాపీలను తక్షణమే పొందగలిగే వెసులుబాటు లభించింది.

లా కళాశాలలో ప్రశాతంగా 'క్లాట్'



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు

సబ్బవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన కామన్ లా ఎంట్రన్స్ టెస్ట్ (క్లాట్) ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు సెంటర్లు విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కర్నూల్, రాజమండ్రిలలో ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం1100 మంది పరీక్ష రాయగా, సబ్బవరం డీఎస్ఎన్ఎల్‌యూలో 250 మంది పరీకు హాజరైనట్టు ఉప కులపతి ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు తెలిపారు. పరీక్షా ఏర్పాట్లును ఆయన పరిశీలించారు.

5న గొర్లివానిపాలెంలో విగ్రహాల ప్రతిష్ఠ

సబ్బవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం శివారు గొర్లివానిపాలెం ఉమారామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో ఈ నెల ఐదో తేదీన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప, సరస్వతి, నాగబంధ విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చింనాయుడు ఆదివారం తెలిపారు.

ఇండోర్ స్టేడియం పనులు వేగవంతం చేయాలి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం కావాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కాంట్రాక్టర్‌ను కోరారు. క్రీడా అసోసియేషన్ల సభ్యులతో కలిసి ఆదివారం ఆయన సదరు పనులను పరిశీలించారు.

84వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 84వ వార్డు పరిధి కొణతాలవారి వీధిలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు పలువురు ఇళ్లకు వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టారు. సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి గుర్తింపు కార్డులను అందజేశారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

కశింకోట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఇక్కడి పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడారు. గత నాలుగు నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రెండు నెలల వేతనాలు ఇస్తామని ఈవో చెప్పారని తెలిపారు. గత నెలలో మృతి చెందిన పంచాయతీ కార్మికుడు రవ్వ అప్పారావుకు మట్టి ఖర్చులకు రూ.ఐదు వేలు ఇస్తామని చెప్పారన్నారు. ఆ కార్మిక కుటుంబాన్ని ఆదుకునేలా అప్పారావు భార్యకు ఆ ఉద్యోగ బాధ్యతలు అప్పగించాలని కోరారు. క్రమం తప్పకుండా పంచాయతీ కార్మికుల వేతనాలు సకాలంలో ఇచ్చేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు కొండబాబు, దేవుడు, రామాజీ, కుమార్, సన్యాసమ్మ, రమేష్, అబ్బులు తదితర కార్మికులు పాల్గొన్నారు.

అల్లకల్లోలంగా ముత్యాలమ్మపాలెం తీరం



తీరంలో ఒడ్డుకు చేర్చిన పడవలు

పరవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాన్ కారణంగా మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరం అల్లకల్లోలంగా మారింది. ఉవ్వెత్తున కెరటాలు ఎగసి పడుతున్నాయి. తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తున్నాయి. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులంతా చేపల వేటకు దూరంగా ఉన్నారు. గత నాలుగు రోజులుగా ఇళ్లకే పరిమితమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా వలలు, తెప్పలు, పడవలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తిక్కవానిపాలెం తీరంలో కూడా అలలు ఎగసి పడుతున్నాయి. పర్యాటకులతో కళకళలాడే తీరం తుపాన్ కారణంగా బోసిపోయింది.

ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు మద్దతుగా ప్రచారం



సంఘీభావం తెలుపుతున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ తరుపున పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మను అంతా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఫెడరేషన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక నరసింగరావుపేటలో మండల శాఖ అధ్యక్షుడు కొణతాల గణేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రఘువర్మ గెలుపునకు శ్రేణులంతా కష్టపడి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ నాయకులు వై. శ్రీనివాసరావు, డి.నూకేష్, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణంరాజు, వెంకటరమణ, శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు నమూనా పరీక్ష



ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కశింకోట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోట డీపీఎన్ స్కూల్‌లో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) నమూనా పరీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఎస్.తమ్మిరాజు, ఉపాధ్యక్షుడు ఆచంట నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి నమూనా పరీక్షలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడమే కాకుండా ప్రభుత్వం నిర్వహించే పరీక్షను చక్కగా రాసేందుకు దోహదపడతాయన్నారు. అనంతరం పరీక్షల్లో పాటించాల్సిన కీలకమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డి.నూకేష్, ఎస్.రమేష్, మల్లేశ్వరరావు, కొణతాల సోమశేఖర్, ఎ.వి.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడితే సంపూర్ణ జీవితం

- హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు డీఎంహెచ్‌వో బాలాజీ సూచన
- ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ బాలాజీ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సక్రమంగా చికిత్స పొంది, మందులు వాడితే హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు కూడా సంపూర్ణ జీవితాన్ని పొందవచ్చునని డీఎంహెచ్‌ట, లెప్రసీ, హెచ్ఐవీ, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకు జరిగిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. నెహ్రూచౌక్‌లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నపిల్లల అత్యవసర చికిత్స కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, పురుషుల నుంచి మహిళలకు హెచ్ఐవీ సోకుతుందని వివరించారు. ఇందుకు సంబంధించిన కేసులే అధికంగా ఉంటున్నాయన్నారు. కొత్తగా నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ మంది బాధితుల వయసు 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని వివరించారు. గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలు తప్పనిసరి చేసి పుట్టే బిడ్డకు వ్యాధి సోకకుండా చికిత్స అందించడం జరుగుతుందన్నారు. జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే వ్యాధి బారిన పడుతున్నారన్నారు. వ్యాధికి గురైన వారిలో రోగ నిరోధకశక్తి తగ్గుతుందన్నారు. ఈ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. వివాహానికి ముందే హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవడం ద్వారా జీవిత భాగస్వామికి వ్యాధి సోకకుండా చర్యలు తీసుకోవచ్చునన్నారు. హెచ్ఐవీ సోకిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందన్నారు. అనంతరం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ ప్రియదర్శిని, డాక్టర్ హేమ, బ్లడ్ బ్యాంక్ మెడికల్ అధికారి డాక్టర్ కనకదుర్గ, సీఎస్‌వో స్పందన, వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో 40 వేల డెత్ క్లైములు పెండిగ్
- ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం

తుమ్మపాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికులకు బకాయిపడిన బీమా పరిహారాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశంలో మాట్లాడారు. గత జగన్ ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. ఈ కారణంగా సుమారు 40 వేల డెత్ క్లైములు పెండిగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే ఆడపిల్లల వివాహ ఖర్చులు, కాన్పు ఖర్చుల కింద ఇచ్చే పరిహారాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వ అవసరాలకు మళ్లించిందని ఆరోపించారు. అలా మళ్లించిన నిధులను తిరిగి సంక్షేమ బోర్డు ఖాతాలో కూటమి ప్రభుత్వ జమ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు మహాలక్ష్మినాయుడు, ప్రతినిధులు అరిగా అప్పలకొండ, పీలా వెంకట్రావు, చెల్లూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఠాగూర్'లో మృతులకు రూ.కోటి పరిహారం

- సీఐటీయూ నాయకుడు కోటేశ్వరరావు డిమాండ్

అనకాపల్లి టౌన్, డిసెం బరు 1 (ఆంధ్రజ్యోతి) : ఠాగూర్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబాలకు తక్షణమే రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఫార్మాసిటీలోని ఠాగూర్ లేబరేటరీ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో పాటు 30 మంది వరకు వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారన్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు శుక్రవారం వచ్చిన రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్ మృతులకు కేవలం రూ.40 లక్షలు మాత్రమే పరిహారం ప్రకటించి చేతులు దులుపుకుని వెళ్లిపోయారన్నారు. అలా కాకుండా తక్షణమే మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.